
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
సోమవారం 17 ఫిబ్రవరి 2025



సాగునీటి కోసం మగ్దుంపూర్ రైతుల ఆందోళన

- మా గ్రామంపై ఎందుకింత వివక్ష?
- పిల్ల కాల్వలు ఏర్పాటు చేసి రంగనాయక సాగర్ నీటిని అందించాలి

8



విరబూసిన విహంగాలు

మోడువారిన చెట్టు ఆకులు లేవని చింతస్తుంటే విహంగాలు పూలై విరబూశాయి. ఎండిపోయిన ఆ వృక్షం పక్షులకు ఆవాసమై ఆశ్రయిమిస్తుంది. ప్రకృతి వింతై చూపరులను కనువిందు చేస్తుంది. చేర్యాల పట్టణ శివారులోని జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్టుపై కొంగలు వాలడంతో ఈ మనోహర చిత్రం ఆవిష్కృతమైంది. స్థానికులు, ప్రయాణికులు చూసి అబ్బురపడుతున్నారు.

- చేర్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి)

డిజిడల్ సర్వే

పంటల వివరాల నమోదుకు ఏఈవోల అవస్థలు

- జిల్లాలో 514 గ్రామాలు.. 123 మంది ఏఈవోలు
- రోజుకు 20-30 ఎకరాలకు మించి ఆన్‌లైన్ చేయని వైనం
- సహాయకులు లేక సత్వర నమోదుకు ఇబ్బందులు

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతులు యాసంగిలో సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవోలు) ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో ఇచ్చిన ట్యాబ్‌లు మరమ్మతుకు గురికావడంతో స్మార్ట్‌ఫోన్లలో వివరాలు నమోదు చేస్తున్నారు. అందులోనూ ఆన్‌లైన్‌లో నమోదుకు తంటాలు తప్పడం లేదని ఏఈవోలు వాపోతున్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రతీ సర్వే పనుల్లో తమను వినియోగించుకుంటున్నారని, తాము శాఖాపరంగా చేసే సర్వేకు మాత్రం ఇతర సిబ్బందిని సహాయకులుగా ఇవ్వకపోవడంతో పంటల నమోదు ప్రక్రియ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్థంగాక తలలు పట్టుకుంటున్నా ఏఈవోలు

జిల్లాలో దాదాపు మూడు లక్షల ఎకరాల డిజిటల్ సర్వే చేయాల్సి ఉంది. ఈనెల 2న ఏఈవోలు పంటల సర్వేను ప్రారంభించారు. నేటి వరకు కేవలం 55 వేల ఎకరాల్లోనే సర్వే పూర్తి చేశారు. రెవెన్యూ అధికారుల సూచనల ప్రకారమే వ్యవసాయ విస్తరణ అధికారులు డిజిటల్ సర్వే చేపడుతున్నారు. గత ప్రభుత్వం రైతుబీమా పథకం అమలు చేయడంతో పట్టాదారు కుటుంబంలోని అందరి పేరిట కొంత కొంత భూమి పట్టా చేశారు. దీంతో అదే సర్వేనంబర్‌ను విభజించి నంబర్లు కేటాయించడంతో ఏ పొలం, ఏ రైతు పేరున ఉందన్న విషయం అర్థంగాక తలలు పట్టుకుంటున్నారు. పంట సర్వేకు వస్తున్నామని ముందస్తుగా రైతులకు సమాచారం ఇచ్చినా.. పొలాల వద్ద అందుబాటులో లేకపోవడంతో వివరాల నమోదులో జాప్యం జరుగుతోంది. రోజుకు 20-30 ఎకరాలకు మించి నమోదు కావడం లేదు. గతంలో పంటల సర్వే ప్రక్రియ రాగానే రెవెన్యూ సిబ్బందిని సహాయకులుగా వెంట పంపడంతో ఎవరి పొలం ఎక్కడుంది.. ఏ రైతు, ఏ పంట వేశారనే వివరాలు వెంటనే తెలుసుకోవడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం చకచకా జరిగిపోయేవి. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వే ఆరు నెలలైనా పూర్తి చేయలేని పరిస్థితి ఉందని కొందరు ఏఈవోలు చెబుతున్నారు.



నంగునూర్ మండలంలోని వర్మేట గ్రామంలో సెల్‌ఫోన్ ద్వారా పంటల వివరాలను నమోదు చేస్తున్న ఏఈవో


డీఏవోకు వినతి పత్రం

జిల్లాలో పనిచేస్తున్న ఏఈవోలందరూ తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 12 న కలెక్టరేట్ కార్యాలయంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీఏవో రాధికకు వినతి పత్రం సైతం అందించారు. జిల్లాలోని

- మిగతా 8వ పేజీలో..

సామాజిక స్పృహను కలిగించాలి

- అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్‌వీకే రెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఎల్‌వీకే రెడ్డి

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక స్పృహను కలిగించే వివిధ రకాల కార్యక్రమాలను కౌన్సిలర్లు చేపట్టాలని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి దక్కిందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్‌వీకే రెడ్డి సూచించారు. సిద్దిపేట అంబేడ్కర్ రీజనల్ స్టడీ సెంటర్‌ను ఆదివారం ఆయన స్టూడెంట్ సర్వీస్ సెల్ డైరెక్టర్ డా.వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ వైపుకు మరలకుండా వారి లోపల సామాజిక చైతన్యాన్ని, పౌర స్పృహను కల్పించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని తెలిపారు. అపార్ నమోదులో దేశంలోని మిగతా యూనివర్సిటీలతో పోలిస్తే అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాత్రమే ముందుందని తెలిపారు. డిస్టెన్స్ యూనివర్సిటీ డిజిటల్ యూనివర్సిటీగా మారిందన్నారు. స్టడీ సెంటర్లు నిర్వహించే సెమినార్లకు కావలసిన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. తెలిపారు. త్వరలోనే స్టడీ సెంటర్‌కు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌ను మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ డాక్టర్ ఎం.శ్రద్ధానందం కార్యాలయ సిబ్బంది ఎల్లం, రాజు, కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యలు.. హడల్

- మాయమవుతున్న మానవత్వం
- సంగారెడ్డి జిల్లాలో వరుస హత్యల కలకలం
- కారణమేదైనా.. ప్రాణం తీయడమే!
- క్షణికావేశంలో నిర్ణయాలు
- నిండు జీవితాలు జైలుపాలు
- అనాథలవుతున్న చిన్నారులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

7

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- వేర్వేరు చోట్ల ఘటనలు... పలువురికి తీవ్ర గాయాలు
- కొండపాకలో ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టిన కారు
- ఒకరు మృతి, నలుగురికి గాయాలు
- గజ్వేల్‌లో రెండు కార్లు ఢీకొని ఒకరి దుర్మరణం
- రామాయంపేటలో బైక్ ఢీకొని పాదచారి

7

పుట్టెడు దుఃఖంలోనూ భర్త అవయవాలు దానం

- పలువురికి ప్రాణదానం

7



కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం



వెండితొడుగులను అందజేస్తున్న భక్తులు

ఐదో వారం అశేష భక్తజనం

- మార్మోగిన కొమురవెల్లి మల్లన్న క్షేత్రం
- పట్నాలు రచించి, బోనాలు నివేదించి మొక్కుల చెల్లింపు
- దర్శించుకున్న ఎంపీ అనిల్, ఎమ్మెల్యే పద్మారావు

చేర్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్నస్వామి బ్రహ్మోత్సవ జాతరలో భాగంగా ఐదో వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్య స్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మకు కల్లు, బెల్లంపానకం శాకపెట్టి బోనం నివేదించారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులుకట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన లైన్లలో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటల పాటు సమయం పట్టింది. సికింద్రాబాదు ఎమ్మెల్యే పద్మారావు, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ మల్లన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

14 కిలోల వెండితొడుగులు విరాళం

హైదరాబాద్‌కు చెందిన ఎపిటోమ్ ప్రాజెక్ట్ మేనేజర్ కాంత జైపాల్ మల్లన్న ఆలయ గర్భాలయంలోని విఘ్నేశ్వర, మునీశ్వర, సంగమేశ్వర స్వామి విగ్రహాలకు 14 కిలోల పరిమాణం గల వెండితొడుగు ఆభరణాలను మొక్కుబడిగా అందించారు.

నేడు ఎర్రవల్లికి ఎమ్మెల్సీ కవిత



ప్రజ్ఞాపూర్ వద్ద ఎమ్మెల్సీ కవితతో ఎర్రవల్లి మాజీ సర్పంచ్ భాగ్య బాలరాజు తదితరులు

మర్కుక్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముడుపు చెల్లించుకోవడానికి ఎమ్మెల్సీ కవిత సోమవారం ఎర్రవల్లికి విచ్చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ భాగ్యబాలరాజు తెలిపారు. కరీంనగర్‌కు వెళ్తున్న ఎమ్మెల్సీ కవితను ఆదివారం ఎర్రవల్లి మాజీ సర్పంచ్ భాగ్య బాలరాజు ఆధ్వర్యంలో గ్రామస్థులు ప్రజ్ఞాపూర్‌లో కలిసి తాము నిర్వహించబోయే ఆయుష యాగానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఇటీవల ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ కాగా, ఆమె క్షేమంగా బయటకు రావాలని ఎర్రవల్లి మాజీ సర్పంచ్ భాగ్య బాలరాజు, మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మీకృష్ణ ఆధ్వర్యంలో 100 మందికి పైగా గ్రామస్థులతో వరదరాజపురం బాట అంజనేయస్వామి, వరదరాజస్వామి ఆలయాలకు వెళ్లి ముడుపులు కట్టారు. ఎర్రవల్లి గ్రామస్థులు సోమవారం నిర్వహించనున్న ముడుపు చెల్లింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత హాజరుకానున్నట్లు భాగ్య బాలరాజు పేర్కొన్నారు. అనంతరం ఎర్రవల్లి ఫంక్షన్‌హాల్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలలో భాగంగా నిర్వహిస్తున్న ఆయుష సుదర్శన యాగంలో కూడా పాల్గొంటారని తెలిపారు. ఎమ్మెల్సీ కవితను ఆహ్వానించిన వారిలో కర్కపట్ల బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ గీసు మల్లేశం, సంఘ నవీన్, గ్రామ నాయకులు శ్రీశైలం, కృష్ణ తదితరులు ఉన్నారు.

నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం

- బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామ అభివృద్ధిలో భాగంగా తనపై వచ్చిన అవినీతి ఆరోపణలు అవాస్తవమని బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి తెలిపారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసినసమావేశంలో ఆయన మాట్లాడుతూ కావాలని కొందరు గిట్టని వారు దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. 2020-21లో తమ గ్రామానికి కల్లాలు నిర్మాణం పది మందికి మంజూరైతే, ఒక్క రైతు మాత్రమే నిర్మించుకున్నాడని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రుల సహకారంతో ఇటీవల తన గ్రామానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించి, అభివృద్ధి పనులు చేయిస్తున్నందుకు తనపై అవినీతి ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మంద పాండు, రాజయ్య, రవి, నిజాముద్దీన్ తదితరులు ఉన్నారు.



అంబులెన్స్ ఎక్కడా?

- కుకునూరుపల్లి పీహెచ్‌సీలో వారం రోజులకే గాయబ్
- అందుబాటులో లేని '108' వాహనం

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారి.. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు.. ప్రతీ రోజు ఈ రహదారిపై ఏదో ఒక చోట ప్రమాదం జరగుతూనే ఉంటుంది. గత సోమవారం కుకునూరుపల్లి బస్టాండ్ వద్ద కార్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా దాదాపు 40 నిమిషాల తర్వాత ఘటనా స్థలానికి చేరుకున్నది. అప్పటి వరకు తీవ్ర గాయాలతో బాధపడుతున్న క్షతగాత్రుడి బాధ వర్ణనాతీతం. అంబులెన్స్ వచ్చే సరికి స్థానిక వైద్యులతో ప్రాథమిక చికిత్స అందించి అనంతరం అంబులెన్స్‌లో తీవ్ర గాయాలతో ఉన్న క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇటు గజ్వేల్.. అటు దుద్దెడ నుంచి అంబులెన్స్ రావడానికి దాదాపు 40 నిమిషాల సమయం పడుతుంది. మరేదైనా ప్రమాద ఘటనకు అంబులెన్స్ వెళితే ఇక ఆ పరిస్థితి వర్ణనాతీతం. అయితే, కుకునూరుపల్లి మండలం నూతనంగా ఏర్పడిన దృష్ట్యా ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌ను మంజూరు చేశారు. ఇంతవరకు బాగానే వచ్చిన వారం రోజులకే అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. డిసెంబర్ 8న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన అంబులెన్స్ వారం పాటు మాత్రమే ఉన్నది. తర్వాత ఎటు వెళ్లిందో తెలియదు. కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ సౌకర్యంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్‌ని వివరణ కోరగా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

వరాహాల వైపరీత్యం

వరాహాల వైపరీత్యం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నది. సాగు చేసిన పంటలు అడవి పందుల పాలవుతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న చేలు కంకి పెట్టె దశకు చేరుకోగా, అడవి పందులు రాత్రి వేళలో చేనుల్లో దూరి పీచులను కొరికి వేస్తూ పంటను పాడు చేస్తున్నాయి. పగలు, రాత్రి చేనుల వద్ద కాపలా కాస్తు కంటిమీద కునుకులేకుండా కష్టపడుతున్నారు. ఒక్కోసారి పందులు గుంపులుగా రావడంతో ఎక్కడ దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన మొక్కజొన్న, వరి, మిర్చి, కీర దోస తదితర పంటలను అడవి పందుల బెడద నుంచి రక్షించేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు. చేల చుట్టూ చీరలతో రక్షణ వలయం ఏర్పాటు చేస్తున్నారు.

- చిన్నకోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి)





చిన్నకోడూరు శివారులో అడవి పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న చేను, మండలంలోని ఎల్లమ్మజాలు శివారులో మిర్చి పంటకు రక్షణగా కట్టిన చీరలు

చోరీ నిందితుల అరెస్ట్

శివ్వంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడిన నలుగురు మద్యం మత్తులో పరిశ్రమలో చోరీకి పాల్పడిన ఘన పెద్ద గొట్టిముక్కల గ్రామంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కల శివారులోని భావ్యాస్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ పరిశ్రమ వెనక గేటు నుంచి శనివారం రాత్రి నలుగురు చొరబడి 100 కేజీల స్క్రాప్, 30 మీటర్ల కేబుల్ వైర్లు అపహరించుకుపోయారు. పరిశ్రమ నిర్వాహకుడు మండేపూడి కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా గుమ్మడిదల గ్రామానికి చెందిన వెంకటేష్, ఆంజనేయులు, బ్రహ్మాచారి, ధర్మేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నిజం ఒప్పుకున్నారు. దీంతో దొంగిలించిన సొత్తును రికవరీ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

భవిష్యత్తు మనదే..

● కార్యకర్తలతో మాజీ మంత్రి కేటీఆర్

రామాయంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అధికారం లేదని ఎవరూ అధైర్యపడకుండా బలంగా పనిచేయాలని, భవిష్యత్ అంతా మనదేనని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన సిరిసిల్లకు వెళ్లి సిద్దిపేట మీదుగా హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యంలోని రామాయంపేట బైపాస్‌లో టీ తాగేందుకు ఆగారు. ఆయన వెంట మాజీ ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్ రెడ్డి ఉన్నారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు భారీగా తరలి వచ్చి కేటీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్‌ను కలిసినవారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్, సొసైటీ చైర్మన్ చంద్రం ఉన్నారు.



రామాయంపేటలో నాయకులు, కార్యకర్తలతో కేటీఆర్



రోడ్డుపై వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీరు

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

● వారంరోజులైనా పట్టించుకోని అధికారులు

నర్సాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపం నుంచి పట్టణంలోకి వెళ్లే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకై.. వారంరోజులుగా నీరంతా వృథాగా పోతోంది. అంతకుముందు కూడా పైపులైన్ లీకవ్వగా.. మున్సిపల్ వారు తాత్కాలిక మరమ్మతులు చేశారు. అయితే రెండురోజులకే అది లీకవ్వడంతో మున్సిపల్ అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతు చేయాలని కోరుతున్నారు. ఈ లీకేజీ కూడా మిషన్ భగీరథ డీఈఈ కార్యాలయానికి అతి సమీపంలోనే ఉండటం విశేషం.

హత్యలు.. హడల్

గత మూడేళ్లలో సంగారెడ్డి జిల్లాలో జరిగిన హత్యలు	2022	2023	2024
హత్యలు	41	53	55
ఆస్తి కోసం జరిగినవి	4	5	10

- మాయమవుతున్న మానవత్వం
- సంగారెడ్డి జిల్లాలో వరుస హత్యల కలకలం
- కారణమేదైనా.. ప్రాణం తీయడమే!
- క్షణికావేశంలో నిర్ణయాలు
- నిండు జీవితాలు జైలుపాలు
- అనాథలవుతున్న చిన్నారులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా హత్యలతో అట్టుడుకుతోంది. ఆర్థిక లావాదేవీలు, ఆస్తి వివాదాలు, వివాహేతర సంబంధాల కారణంగా తరచూ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మానవ సంబంధాలు మంట కలిసిపోతున్నాయి. తల్లీ, కొడుకు, కూతురు, తండ్రి, భార్య, భర్త అనే పదాలకు విలువ లేకుండాపోయింది. ఆర్థిక లావాదేవీలే ప్రధాన భూమిక పోషిస్తూ ఈ దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలతో నిండు జీవితాలు జైలుపాలవుతున్నాయి. ఈ ఘటనలతో ఇటు నిందితుల, అటు హతుల కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. కుటుంబ పెద్దలను కోల్పోయి వారి పిల్లలు అనాథలవుతున్నారు. జిల్లాలో ఏటా హత్యా నేరాల సంఖ్య పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

కూతురుతో సన్నిహితంగా ఉంటున్నాడని..

సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం నాగ్దర్ రాంచెందర్ తాండాకు చెందిన దశరత్(30)ను నారాయణఖేడ్ మండలం మేఘ్యానాయక్‌తండాకు చెందిన గోపాల్ అనే వ్యక్తి ఈ నెల 12న దారుణంగా హత్య చేశాడు. వివాహితుడైన దశరథ్ తన కూతురుతో సన్నిహితంగా ఉండడం చూసి భరించలేకనే ఈ హత్య చేసినట్లు గోపాల్ అంగీకరించాడు. హత్య అనంతరం అతడి మృతదేహాన్ని దహనం చేసి అనంతరం ముక్కలుగా నరికి ఈదుల్‌తండాలోని అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య పడేశాడు. అనంతరం ఏం తెలియనట్లు, ఎవరికీ అనుమానం రాకుండా దశరత్ స్వగ్రామంలోని ఓ మేకను కొనుగోలు చేసి రావడం దృశ్యం సినిమాను తలపించింది.

స్నేహం వికటించి..

తనను అనవసరంగా కేసులో ఇరికించాడని ఓ వ్యక్తి మరో వ్యక్తిని అతి దారుణంగా హత్య చేసిన ఘటన సంగారెడ్డి పట్టణంలో జనవరి 11న చోటు చేసుకుంది. మహారాష్ట్రకు చెందిన షేక్ సమీర్ అమూల్(27) బతుకు దెరువు కోసం సంగారెడ్డికి భార్యాపిల్లలతో వలస వచ్చాడు. సమీర్ పగటి పూట డ్రైవర్ పనిచేస్తూ రాత్రి చోరీలు చేసేవాడు. రాజంపేటకు చెందిన అనీస్ అనే వ్యక్తిని ఓ కేసులో పోలీసులకు చెప్పి ఇరికించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న అతడు ఆ రోజు అర్ధరాత్రి సంగారెడ్డి పట్టణంలోని సితార థియేటర్ ఎదురుగా ఖాళీ స్థలంలోకి సమీర్‌ను పిలిపించి కత్తితో గొంతు కోసి దారుణంగా హతమర్చాడు.

ఆస్తికోసం తమ్ముడినే..

ఆస్తి కోసం సొంత తమ్ముడిని అన్న అతి దారుణంగా హత్య చేసిన ఘటన ఈ నెల 14న మునిపల్లి మండలం చీలపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్కాగోని దుర్గయ్యకు ముగ్గురు కుమారులున్నారు. దుర్గయ్య ఎకరం భూమిని అవసరాల నిమిత్తం ఓ వ్యక్తి వద్ద తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నాడు. తండ్రి మృతితో తాకట్టు పెట్టిన భూమి విషయంలో కుమారులు ముగ్గురు గొడవపడ్డారు. పెద్ద కుమారుడు యాదయ్య సదరు భూమిని తాకట్టు నుంచి విడిపించి తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయంలో అన్నదమ్ములు యాదయ్య, శివయ్యలు ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన యాదయ్య తన తమ్ముడు శివయ్యను బండ రాయితో బలంగా కొట్టగా తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం..

ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందన్న నెపంతో అందోల్ మండలం తాలెల్మ శివారులో ఓ యువకుడిని అతి దారుణంగా గుర్తు తెలియని దుండగులు హత్య చేసిన ఘటన జనవరి 12న జరిగింది. నాదులాపూర్‌కు చెందిన కర్రోళ్ల శ్రీనివాస్(30)కు ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న కారణంతో దుండగులు అతడి గొంతు కోసి, బండరాయితో తలపై మోది దారుణంగా హతమర్చారు.

తండ్రిని కొడుతుంటే అడ్డుకునేందుకు వెళ్లిన
బాలికకు తీవ్ర గాయాలు

● చికిత్స పొందుతూ మృతి

మునిపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తండ్రిని కొందరు వ్యక్తులు కొడుతున్నారని ఆపేందుకు వెళ్లిన బాలికను వాళ్లు నెట్టేయడంతో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో చోటుచేసుకుంది. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఓ గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ ఈ నెల 11న గ్రామంలోని వీరారెడ్డి ఇంటి సమీపంలో ఖాళీ స్థలంలో మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో వీరారెడ్డి, దాయాది విజయ్‌రెడ్డి ఇక్కడ మూత్రం ఎందుకు పోస్తున్నావంటూ బూతు మాటలు తిడుతూ చొక్కా పట్టుకుని కొట్టారు. ఇస్మాయిల్ వారిని నెట్టేశాడు. గొడవ జరుగుతుండగా గమనించిన ఇస్మాయిల్ పదిహేనేళ్ల కూతురు వారిని ఆపేందుకు వెళ్లగా తోసేశారు. ఈక్రమంలో ఇస్మాయిల్‌తోపాటు ఆ బాలికకు మూగ దెబ్బలు తగిలాయి. అదేరోజు రాత్రి పెద్దచెల్మెడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇద్దరూ చికిత్స చేయించుకున్నారు. మరుసటి రోజు (ఈ నెల 12న) బాలిక శారీర భాగాల్లో నొప్పి రావడంతో బుదేరాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతురాలి తండ్రి మహ్మద్ ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి మృతి


యాదగిరి(ఫైల్)

ములుగు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వృద్ధుడు బావిలో పడి మృతి చెందిన సంఘటన తునికిబొల్లారంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలం మామిడాల గ్రామానికి చెందిన బొమ్మ యాదగిరి(60) ఆదివారం ఉదయం బొల్లారం గ్రామ శివారులోని ఓ బావిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతిచెందాడు. బావిగట్టుపై మృతుడి చెప్పులు, బట్టలు ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

చేర్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో తాళం వేసిన ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కేశిరెడ్డి బాల్‌రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాదులోని తమ కుమారుడి ఇంటికి వెళ్లాడు. తాళంవేసి ఉండటంతో ఆగంతకులు ఇంట్లోకి చొరబడి అరతులం బంగారం, రూ.10వేలు నగదు అపహరించుకుపోయారు. సమీపంలోనే ఉన్న బొలుగం లక్ష్మి ఇంట్లోనూ వారు చోరీకి యత్నించినా నగదు, ఆభరణాలు లభ్యంకాకపోవడంతో వస్తువులు చిందరవందర పడేసి వెళ్లిపోయారు. అలాగే ఇదే గ్రామంలోని మరొకరి ఇంట్లో చోరీకి యత్నించారు. తాళాలు వేసి ఉన్న ఇంటితలుపులు అనుమానాస్పదంగా ఉండటాన్ని గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించడంతో వచ్చారు. ఈ విషయమై పోలీసులకు తెలపడంతో క్లూస్ టీంను రప్పించి వేలిముద్రల నమూనా సేకరణ చర్యలు తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వేలిముద్రల నమూనా సేకరణకు యత్నిస్తున్న క్లూస్ టీం


దంపుయార్డు ముట్టడికి ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి, మహిళలు

డంపుయార్డును ఏర్పాటు చేయొద్దు

● గుమ్మడిదల కొనసాగుతున్న ఆందోళనలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 16 (ఆంధ్యజ్యోతి) : మండలంలోని ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటు చేయొద్దంటూ స్థానికులు కోరారు. ఈ మేరకు చేపట్టిన నిరసనలు ఆదివారం కూడా కొనసాగాయి. జేఏసీ కన్వీనర్ చిమ్ముల జైపాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి అధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో దళిత సంఘాలు రిలే నిరహార దీక్ష చేపట్టారు. నల్లవల్లి, కొత్తపల్లిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా సంఘాల నేతృత్వంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డితో కలిసి పెద్ద ఎత్తున మహిళలు డంపుయార్డు ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డంపుయార్డుతో పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని, ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని విరమించుకోవాలని నినాదించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

నర్సాపూర్‌లోనూ జేఏసీ.. నేటి నుంచి రిలే దీక్షలు

నర్సాపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నల్లవల్లి ప్రాంతంలోని ప్యారానగర్ వద్ద ఏర్పాటు చేయనున్న హెచ్‌ఎండీఏ డంపుయార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లోనూ జేఏసీ ఏర్పాటైంది. ఈ మేరకు ఆదివారం స్థానిక బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం నాయకులు సమావేశమై నేటి నుంచి రిలే దీక్షలతోపాటు నిరసనలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపుయార్డుతో ఎక్కువగా నష్టపోయేది ఈ ప్రాంతమేనని, ఎట్టి పరిస్థితుల్లోనూ దాని ఏర్పాటును అడ్డుకునేందుకు అందరం కలిసికట్టుగా ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు రమణారావు, గోడ రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, శ్రీధర్‌గుప్తా, భిక్షపతి, అంజిగౌడ్, జ్ఞానేశ్వర్, రిజ్వాన్, అజ్మత్, యాదగిరి, రామచంద్దర్, దావుద్, కొత్త శ్రీనివాస్, దావుద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

వేర్వేరు చోట్ల ఘటనలు... పలువురికి తీవ్ర గాయాలు

- కొండపాకలో ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టిన కారు
- ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు
- గజ్వేల్‌లో రెండు కార్లు ఢీకొని ఒకరు దుర్మరణం
- రామాయంపేటలో బైక్ ఢీకొని పాదాచారి


కొండపాక : డీసీఎంను ఢీకొన్న ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న పాలయ్య, మమత, భీమయ్య, మమత


కొండపాక : డీసీఎం వ్యాన్ కు ఢీ కొట్టిన కారు, సురేశ్ మృతదేహం

కొండపాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు చండె భీమయ్య (38), సురేష్(36), మమత(32), మమత(30), పాలయ్య(60) కారులో సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్తున్నారు. కొండపాక మండలం కొమురవెల్లి కమాన్ సమీపంలోగా రాగనే రాజీవ్ రహదారిపై నిలిచి ఉన్న డీసీఎంను వీరి కారు బలంగా ఢీకొట్టింది. దీంతో సరేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాలయ్య, మమతల పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని..


గజ్వేల్ రూరల్ : వెంకటేశ్ మృతదేహం

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో నలుగురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని గజ్వేల్-పిడిచెడ్ మార్గంలో ఆదివారం చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిదిలోని కొల్గూరు గ్రామానికి చెందిన వెంకటేష్‌తో పాటు అతని బంధువులైన గొట్టిముక్కల గ్రామానికి చెందిన వెంకటేష్, నాని, సాయిగౌడ్‌లు గజ్వేల్ నుంచి కారులో కొల్గూరు వైపు వస్తున్నారు. జనగాం జిల్లా కేశిరెడ్డిపల్లికి చెందిన సాయి పని ఉండగా మిరుదొడ్డి వెళ్లాడు. అక్కడి నుంచి బయ్యారంవైపు వస్తున్నారు. జనగాం జిల్లా కేశిరెడ్డిపల్లికి చెందిన సాయి పని ఉండగా మిరుదొడ్డి వెళ్లాడు. అక్కడి నుంచి బయ్యారం చౌరస్తా మీదుగా మేథినీపూర్ వచ్చేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో గజ్వేల్ పిడిచెడ్ మార్గంలోని పత్తి మిల్లుల సమీపంలో ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో వెంకటేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ వర్షిత, లక్ష్మణ్, రాజు, పైలెట్స్ నరేష్, ప్రభాకర్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని యువకుడు..


నవీన్(ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బైక్ ఢీకొనడంతో యువకుడు మృతిచెందిన సంఘటన రామాయంపేట పాత హైవే కామారెడ్డి దారిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కాస నవీన్(28) శనివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన ఓ యువకుడు అతన్ని బలంగా ఢీకొట్టడంతో నవీన్‌కు తీవ్ర గాయాలయ్యారు. దీంతో అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రబీలో ఆరుతడి
పంటల సాగుపై రైతుల ఆసక్తి

● బోరుబావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితోనే పంటలు

నాగల్ గిద్ద, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరు బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితో రబీలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. నాగల్‌గిద్ద మండలంలో మంజీరా నది పరీవాహక ప్రాంతంలో రైతులు మంజీరా నుంచి పైప్‌లైన్ వేసుకొని చెరకు, గోదుమ, ఉల్లి, వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఇరక్‌పల్లి, ఏనక్‌పల్లి, నాగల్‌గిద్ద, ఔదత్‌పూర్ తదితర గ్రామాల్లో వ్యవసాయ బోరుబావుల్లో ఉన్న నీటితోనే పంటలను పండిస్తున్నారు. కొన్నిచోట్ల మొక్కజొన్న, గోదుమ, ఉల్లి, ఆకుకూరలు, తదితర పంటల సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటల సాగులో తక్కువ పెట్టుబడులకు ఎక్కువ లాభాలు రావడంతో రైతులు రబీలో ఆరుతడి పంటల సాగు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. తక్కువ కాలంలో పంటలు చేతికి అందడంతో పాలకూర, మెంతి, తోటకూర, వంటి పంటలనూ సాగు చేస్తున్నారు.

రబీలో ఆరుతడి పంటలతోనే లాభాలు

రబీలో ఆరుతడి పంటలతోనే అధిక లాభాలు వస్తాయని దీని వల్ల తక్కువ నీరు, తక్కువ పెట్టుబడులు, అధిక లాభభాలు వస్తాయి. ఒక ఎకరంలో ఉల్లి గడ్డ 35 నుండి 40 క్వింటాళ్లు వస్తుంది. అధికారుల సలహాలతో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నాం.

- ధన్‌రాజ్, రైతు, ఔదత్‌పూర్

అలరించిన అవధానాలు


లలితా చంద్రమౌళీశ్వరాలయంలో అష్టావధానం

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని శ్రీ లలిత చంద్రమౌళీశ్వర దేవస్థానంలో మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాహిత్య కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అవధాని మారెపల్లి పట్వర్ధన్ ఒకే రోజు ఆరు అష్టావధానాలు చేసి అలరించారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి వరకు సాగింది. ఒకేరోజు ఆరు అవధానాలు జరుగడంపై సిద్దిపేట సాహిత్య ప్రియులు ఆనందం వ్యక్తం చేశారు. పద్యసాహిత్యం అవధానాల మూలంగా పరిడవిల్లుతుందన్నారు. ఆలయ నిర్వాహకులు పండరి రాధాకృష్ణ అవధానంలో పృచ్ఛకులుగా ఉండ్రాళ్ల రాజేశం, ముద్దు రాజయ్య, నల్ల అశోక్, వేదాల గాయిత్రిదేవి, భ్రమరాంబిక, అరవెల్లి శ్రీదేవి, నాగేశ్వరావు, మచ్చ అనురాధ, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, సింగీతం నరసింహారావు, అష్టకాల విద్యాచరణ్, దుడుగు నాగలత, బస్వ రాజ్ కుమార్, మల్లంపల్లి శిరీష, భావన, మాదవీలత, వరుకోలు లక్ష్మయ్ తదితరులు పాల్గొన్నారు.



మోదుగు మురిపెం..

● విరబూసిన పూలు

కోహీర్, ఫిబ్రవరి 16ః (ఆంధ్రజ్యోతి) : ఆకులన్నీ రాలిపోయి మోడు బారిన మోదుగు చెట్టుకు అరుణ వరుణంలో పూలు విరబూసి కొత్తందాన్ని తెచ్చిపెడుతున్నాయి. అటుగా రాకపోకలు సాగించేవారిని ఇట్టే ఆకర్షిస్తూ కనువిందు చేస్తున్నాయి. కోహీర్ మండలంలోని సజ్జాపూర్, బిలాల్‌పూర్, మనియర్‌పల్లి, బడంపేట, పర్శపల్లి, గోటిగర్‌పల్లి పిచేర్యాగడి, గ్రామాలలోని అటవీ ప్రాంతాలలో మోదుగు చెట్లు అధికంగా ఉన్నాయి. ఈ కాలంలో నిలువెల్లా ఎర్రని పూలతో ఆ చెట్లు మెరిసిపోతున్నాయి. హోలీ రోజున మోదుగు పువ్వులను మరుగ కాచి స్వచ్ఛమైన రంగులను తయారుచేసుకొని పరస్పరం చల్లుకుంటారు. అంతేకాకుండా మోదుగ ఆకులతో మనం భోజనం చేసే ఇస్తార్లు తయారు చేస్తారు. అ చెట్టు వేర్లు దాని నారుతో తాళ్లు, వివిధ వస్తువులు తయారు చేస్తారు. దీని పసరుతో ఆయుర్వేద మందులు తయారు చేస్తారు. ఈ పూలు శివుడికి అత్యంత ప్రీతి. మహాశివ రాత్రి రోజు ఈపూలతో పూజిస్తారు. మోదుగు పూలు జనవరి నెల అరంభం నుంచి మార్చి నెల ఆఖరు వరకు పూస్తుంటాయి.



పుట్టెడు దుఃఖంలోనూ భర్త అవయవాలు దానం

● పలువురికి ప్రాణదానం


నాగేంద్ర(ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు భవిష్యత్తు అంధకారం, మరో వైపు పిల్లల పెంపకం ఎలా అనే ఆవేదన ఇలాంటి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న ఓ మహిళ బ్రెయిన్ డెడ్ అయిన తన భర్త అవయవాలను దానం చేసి గొప్ప మనస్సును చాటుకుంది. వివరాల్లోకి వెళితే రాయపోల్ మండలం పెద్దారెపల్లి గ్రామానికి చెందిన కోంపల్లి నాగేంద్ర(34), లావణ్య దంపతులకు ఐదేళ్ల లోపు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. నాగేంద్ర గజ్వేల్‌లోని ఓ రైస్ డిపోలో పనిచేస్తుండగా లావణ్య గ్రామంలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 2న రాత్రి నాగేంద్ర గజ్వేల్‌లో పనిముగించుకొని బైక్‌పై పెద్దారెపల్లికి వెళ్తున్న క్రమంలో బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స నిర్వహించినప్పటికీ ఫలితం లభించలేదు. ఆదివారం బంధువుల సూచన మేరకు నాగేంద్ర అవయవాలను దానం చేసేందుకు భార్య లావణ్య, తల్లి బాలవ్వ అంగీకరించారు. దీంతో వైద్యులు నాగేంద్ర శరీరం నుంచి అవసరమైన అవయవాలను తీసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయపోల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముబారస్‌పూర్ వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మండలంలోని ఆయా గ్రామాలకు ఈ నెల 17న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తుక్కాపూర్ విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్ రావు, రాయపోల్ విద్యుత్ ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. దీంతో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రాయపోల్, గుర్రాలసోఫా, వడ్డేపల్లి, రామారం, రాంసాగర్, వీరానగర్ సబ్‌స్టేషన్‌ల పరిధి లోని అన్ని వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించండి

ధూళిమిట్ట ,ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఫిబ్రవరి 17న ఆయా మండలాల్లో సేవాకార్యక్రమాలను పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించాలని ఆదివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సేవాకేంద్రం ప్రారంభం

చేర్యాల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : సామాజిక, ఆర్థిక కులగణన సర్వేలో పాల్గొనని వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన నేపథ్యంలో ఆదివారం చేర్యాల మునిసిపల్ కార్యాలయంలో సేవా కేంద్రం ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 28వతేదీ వరకు సేవాకేంద్రంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

సిద్దిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు తోటి స్నేహితులు. దౌల్తాబాద్ మండలం సూరంపల్లికి చెందిన ప్రభాకర్ సిద్దిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్నాడు. అనంతరం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేటు ఉద్యోగిగా పని చేసేవాడు. ఇటీవల గుండెపోటు ప్రభాకర్ మృతి చెందాడు. అతడితో చదువుకున్న మిత్రులకు ఈ సమాచారం తెలియడంతో తలా కొంత పోగు చేసి రూ. 30 వేలను ఆదివారం ప్రభాకర్ కుటుంబానికి అందజేశారు.

నేడు బెక్కల్ రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- బెక్కల్ ఆలయానికి శతాబ్దాల చరిత్ర
- రామాచల గుట్టపై చూపరులను కట్టిపడేసే పరిసరాలు
- నియమనిష్టలతో పూజిస్తే మొండి వ్యాధులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం




బెక్కల్ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, ఆలయంలో కొలువైన మూలవిరాట్

ధూళిమిట్ట,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోనే శతాబ్దాల చరిత్ర గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన బెక్కల్ రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఏర్పాటు పూర్తయ్యాయి. ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో గల రామాచల గుట్టపై కొలువైన స్వామివారి కల్యాణోత్సవం వీరశైవ ఆగమ పద్ధతిలో సోమవారం అంగరంగ వైభవంగా జరగనున్నది. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గ సభ్యులు, అధికారులు భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. చుట్టూ పక్కల ఉన్న గ్రామాల ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం వేలాదిగా కల్యాణోత్సవానికి తరలివస్తారు. బెక్కల్ దేవస్థానం పురాతన దేవాలయంగా పేరు గాంచింది.

భక్తులను కట్టిపడేసే ప్రకృతి రమణీయత

రామాచల గుట్ట చుట్టూ పచ్చటి ఆహ్లాదకరమైన ప్రకృతి రమణీయత చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది. నేటికీ ఎంతో మంది దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్నవారు గుట్టపై నియమ నిష్ఠలతో కొద్దిరోజులపాటు దేవున్ని ఆరాధిస్తే మొండి వ్యాధులు సైతం తగ్గుముఖం పడతాయని భక్తుల విశ్వాసం.

కాకతీయులు నిర్మించిన ఆలయం

క్రీ.శ 1117 సంవత్సరంలో కాకతీయులు భద్రంగపురముగా వ్యవహరించే బెక్కల్ ప్రాంతంలో స్వస్తిశ్రీ రాక్షస నామ సంవత్సర వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున శ్రీ రామలింగేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠాపించి, ఆలయాన్ని నిర్మింపజేశారు. ఓరుగల్లును పరిపాలించే కాకతీయ చక్రవర్తి రుద్రదేవుడికి సామంతుడైన మల్లిరెడ్డి ఈ భద్రంగపురాన్ని క్రీ.శ 1163 నుంచి క్రీ.శ. 1195 వరకు పరిపాలించాడు. అదే సమయంలో కాకతీయులు నిర్మించిన ఆలయం గర్భాలయంలో ఒదిగిపోయేలా గుండోజి అనే శిల్పి చేత మల్లికార్జునస్వామివారి త్రిముఖ ఆలయాన్ని మల్లిరెడ్డి అతివిశాలంగా నిర్మింపజేశారు. తన వంశంలోని 21మందిని ఆ నిర్మాణాలపై పేర్కొని వారి పేరిట 21 శివాలయాలను బెక్కల్ గుట్టపైననే నిర్మింపచేసి వాటిలో శివలింగ ప్రతిష్ఠాపన చేయించినట్టుగా నిర్మాణాలపై చెక్కిన శాసనాల ద్వారా తెలుస్తోంది.

ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



స్వామివారి కల్యాణోత్సవానికి ఆలయ పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం, రాత్రి ఒగ్గుకథ తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఈ ప్రాంతంలో అంగరంగ వైభవంగా జరిగే స్వామివారి కల్యాణంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొననున్నందున అందుకు తగిన విధంగా, ఎవరికీ అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశాం.

- చొప్పరి మల్లేశం, ఆలయ కమిటీ చైర్మన్

'తపాస్‌పల్లి' నుంచి కొండపాకకు నీటి విడుదల




ఆల్టర్నేట్ గేట్‌వాల్వుకు పూజలు చేసి నీటిని విడుదల చేస్తున్న మాజీ సర్పంచ్, కాలువ ద్వారా కొండపాకవైపు వెళ్తున్న నీరు

కొండపాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు చెరువులకు తపాస్‌పల్లి రిజర్వాయర్ డి4 కెనాల్ నుంచి నీటిని కొండపాక మండల రైతులు ఆదివారం విడుదల చేశారు. మండలంలోని సిరిసినగండ్ల గ్రామంలో మాజీ సర్పంచ్ గూడెం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రైతులు రెండు రోజుల నుంచి డి ఫోర్ కాలువలకు మరమ్మతులు చేయించి ప్రత్యామ్నాయంగా గేట్ వాల్వు అమర్చారు. గతంలో కొండపాక మండలంలోని పలు చెరువులో నింపడం కోసం ఏర్పాటు చేసిన డి ఫోర్ కెనాల్‌వద్ద ఆల్టర్నేట్ గేట్ వాల్వు లేకపోవడంతో నీరు రావడం లేదు. లక్ష్మారెడ్డి తన సొంత ఖర్చులతో వాల్వును ఏర్పాటు చేయించి ఆదివారం పూజలు చేసి డిఫోర్ కెనాల్ నుంచి గోదావరి నీటిని విడుదల చేశాడు. ఈ నీటి కాలువల ద్వారా కొండపాక, దమ్మకపల్లి, సిరసనగండ్ల, మర్పడగ చెరువులకు సాగునీరందుతుంది.

సాగునీటి కోసం మగ్దుంపూర్ రైతుల ఆందోళన



మగ్దుంపూర్ కమాన్ వద్ద బైకులపై రైతుల ర్యాలీ

నంగునూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రంగనాయక సాగర్ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు నింపుతున్నప్పటికీ తమ గ్రామాన్ని పట్టించుకోక పోవడం పట్ల మగ్దుంపూర్ గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం నంగునూరు సిద్దిపేట రహదారిలోని మగ్దుంపూర్ స్టేజి వద్ద ఆందోళనకు దిగారు. తమ గ్రామం మీదుగా ఇతర గ్రామాలు బద్దిపడగ ,సిద్ధన్నపేట గ్రామాలకు నీళ్లు విడుదల చేసిన అధికారులు తమ గ్రామంపై ఎందుకు ఇంత వివక్ష చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మగ్దుంపూర్ చెరువుకు రంగనాయకసాగర్ నీరు వెళ్లేందుకు పిల్ల కాలువలు ఏర్పాటు చేయక పోవడం వల్ల ఈదుస్థితి నెలకొన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారులతో పాటు వివిధ పార్టీ నాయకుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదని నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతులు గ్రామం నుంచి మగ్దుంపూర్ స్టేజి వరకు బైకులపై ర్యాలీగా వచ్చి కమాన్ వద్ద ఆందోళన నిర్వహించారు. తమ గ్రామానికి వెంటనే నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు రైతులతో ఫోన్‌లో మాట్లాడి త్వరలోనే చెరువు నింపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

● తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ నాయకుడు శివారెడ్డి, మల్లేషంగౌడ్ ఆధ్వర్యంలో బెజుగామకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నట్లు వివరించారు. అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీ ఎజెండా అని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా విమర్శలకు దిగుతున్నాయన్నారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని కేసీఆర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నక్క రాములు, శివారెడ్డి, మల్లేశం తదితరులున్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం



కొండపాక: రవీంద్రనగర్ మహిళలతో కలిసి బోనమెత్తిన ఎమ్మెల్సీ కవిత

గజ్వేల్/కుకునూరుపల్లి/కొండపాక, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, సిద్దిపేట జిల్లాల పర్యటనకు వెళ్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవితకు ఆదివారం మార్గమధ్యలో పలుచోట్ల ఘనస్వాగతం లభించింది. రాజీవ్‌రహదారి మీదుగా వెళ్తున్న కవితకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాణసంచా కాలుస్తూ భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత అభివాదం చేస్తూ, పలువురితో మాట్లాడుతూ వెళ్లారు. అలాగే ఎమ్మెల్సీ వాహనంలో వస్తూ కుకునూరుపల్లి గ్రామపంచాయతీ వద్ద ఆగడంతో బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాలుస్తూ, పువ్వులు చల్లుతూ శాలువాతో సన్మానించారు. అనంతరం తెలంగాణ తల్లికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవీ రవీందర్, కోల సద్గుణ రవీందర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట కవిత ఆదివారం సిద్దిపేటకు వెళ్తుండగా కొండపాక క్రాస్ రోడ్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు మహిళలు ఆమెకు బతుకమ్మ బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. రాజీవ్ రహదారి నుంచి సిద్దిపేటకు వెళ్తున్న క్రమంలో కొండపాక క్రాస్ రోడ్ వద్ద కొద్దిసేపు ఆపి బోనాలతో వచ్చిన మహిళలతో మాట్లాడారు. బోనమెత్తుకొని జై తెలంగాణ నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్, తెలంగాణ జాగృతి నాయకుడు అనంతల ప్రశాంత్, బీఆర్ఎస్ నాయకులు, రవీంద్రనగర్ మహిళలు పాల్గొన్నారు.

కొండపోచమ్మను దర్శించుకున్న మాజీ ఎంపీ



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన కొండపోచమ్మ అమ్మవారిని ఆదివారం రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ దంపతులకు, మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్ దంపతులకు అమ్మవారి ప్రసాదం అందించి శాలువాతో సన్మానించారు. కాగా కొండపోచమ్మ వారోత్సవాలు ఐదో వారం కావడంతో భక్తులు వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, హరి, చిన్నా, సుధాకర్, లక్ష్మణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడి సస్పెన్షన్

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేసిన ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ, గజ్వేల్ నియోజకవర్గ శనిగరి రమేష్ మాదిగలను ఎమ్మార్పీఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివ మాదిగ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంద్రాతి కృష్ణమాదిగ, శనిగరి రమేష్ మాదిగలు ఎమ్మార్పీఎస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నట్టు ఆరోపణలు రావడంతో విచారణ జరిపామన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశానుసారం వారిని క్రమశిక్షణ చర్యల కింద ఎమ్మార్పీఎస్ నుంచి తొలగించినట్టు తెలిపారు. నేటి నుంచి ఎమ్మార్పీఎస్‌కు వారితో ఎలాంటి సంబంధం ఉండదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగారపు ఇందిర సోదరుడు చేర్యాల పట్టణానికి చెందిన కర్రోల్ల భాస్కర్ ఇటీవల మరణించాడు. మృతి పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తదితరులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాల్‌లక్ష్మి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

డిజిడల్ సర్వే

(5వ పేజీ తరువాయి)

26 మండలాల్లో ఉన్న 514 గ్రామపంచాయతీల్లో 123 మంది ఏఈవోలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఫిబ్రవరి 2 నుంచి పంట వివరాల నమోదు చేపడుతున్నామని, సహాయకులు లేకపోవడంతో ఏయే సర్వేనంబర్లలో ఏయే పంటలు సాగు చేశారనే వివరాలు పక్కపొలం రైతులు చెప్పలేని స్థితిలో సర్వే ఎలా చేస్తామని ఏఈవోలు ప్రశ్నిస్తున్నారు. సహాయకులు లేకపోవడంతో మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు.

సర్వేలో ఇబ్బందులు పడుతున్నాం

డిజిటల్ సర్వేలో క్షేత్రస్థాయిలో చాలా ఇబ్బందులకు గురవుతూ ఒత్తిడికి లోనవుతున్నాం. సర్వే చేసేందుకు సహాయకులుగా మాకు అందించాలి. పంట వివరాల నమోదుకు గతంలో వ్యవసాయశాఖ ఇచ్చిన ట్యాబ్‌లు ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో మా వ్యక్తిగత స్మార్ట్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నమోదు చేస్తున్నాం. ఫొటో, డాటా ఎంట్రీ సమయంలో ఫోన్లు వేడెక్కి పాడవుతున్నాయి.

- శ్రీకాంత్ రెడ్డి ఏఈవో

వినతులను ఉన్నతాధికారులకు నివేదించాం

జిల్లా వ్యాప్తంగా డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ కొనసాగుతున్నది. ఇది రైతులకు చాలా ఉపయోగపడుతుంది. ఏఈవోలు క్షేత్రస్థాయిలో పంటల నమోదుపై డిజిటల్ పంట సర్వే పంట వివరాల నమోదులో కలుగుతున్న ఇబ్బందులను వారు వినతి పత్రం ద్వారా విన్నవించారు. వారి సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం.

- రాధిక, డీఏవో

కారు, బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కారు బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని జాలిగామలో చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన కోంపల్లి నాగేంద్రం(34) కూలీ పని నిమిత్తం ఈ నెల 2న గజ్వేల్‌కు వచ్చి తిరిగి ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో జాలిగామ గ్రామ శివారలోకి రాగానే కారు బైక్‌పై వెళ్తున్న నాగేందర్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే చికిత్సనిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ములుగులోని ఆర్‌వీఎం ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లో యశోదా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

ఇసుక అక్రమ డంపును పట్టుకున్న పోలీసులు

కొండపాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొండపాక శివారులోని వడ్డెర కాలనీలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అక్రమంగా డంప్ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇసుక డంప్ చేసిన స్థలంపై దాడి చేసి సుమారు 116 టన్నుల ఇసుకను పట్టుకున్నారు. రవీంద్రనగర్ విశ్వనాథపల్లికి చెందిన పోచయ్య, కొమ్మిరి మహేష్, బోదసు సురేష్ అనే ముగ్గురు వ్యక్తులు అక్రమంగా ఇసుకను డంప్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు డంపును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కుకునూరు పల్లి పోలీసులు తెలిపారు.

'ఈత చెట్లను కాల్చినవారిపై చర్యలు తీసుకోవాలి'



కాలిపోయిన ఈత చెట్లు

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈత చెట్లను కాల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు నర్సాగౌడ్ మాట్లాడుతూ గ్రామ సమీపంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ సంఘానికి చెందిన 500 ఈత చెట్లు ఉన్నాయన్నారు. ఆదివారం అక్కడికి వెళ్లిన గౌడ సంఘం సభ్యులు ఈత చెట్లు కాలిపోయి ఉండడాన్ని గమనించి గ్రామస్థులకు సమాచారం అందించారు. గౌడసంఘం సభ్యులు ఘటనాస్థలానికి వెళ్లి సుమారు 40 చెట్ల వరకు కాలిపోయినట్లు తెలిపారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయబాట పునరుద్ధరణకు ఎన్ఆర్ఐ విరాళం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎన్ఆర్ఐ

మద్దూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్మాముల గ్రామశివారులో రైతులు గత 30 యేళ్లుగా వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు బాట సరిగా లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య ఎన్ఆర్ఐ ఇప్ప నిశికాంత్ రెడ్డి దృష్టికి రావడంతో బాట పునరుద్ధరణకు తక్షణమే రూ.5 లక్షల చెక్కు అందజేసి ఆదివారం పనులకు ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. బాట పునరుద్ధరణకు సొసైటీ మాజీ సీఈవో, రైతు ఆలేటి విష్ణు ఆధ్వర్యంలో గ్రామస్థులకు చెక్కు అందజేసిన నిశికాంత్‌రెడ్డి ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రైతులు వెల్ది గోపాల్‌రెడ్డి, పెద్దఊట్ల కరుణాకర్‌రెడ్డి, సుందరగిరి సత్యనారాయణ, వేచరేణి కనకయ్య, మాజీ సర్పంచ్ జంగిలి భిక్షపతి, ఊట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మంద మధు, డాకూరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామస్థాయి కమిటీల ఎన్నిక



గ్రామ అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి

నంగునూరు, ఫిబ్రవరి 16 : కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం నంగునూరు మండలం నాగరాజుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షుడిగా ముక్కెర లింగం, ఉపాధ్యక్షుడిగా ఇప్పల సాయిలు, ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, కార్యదర్శి ఎర్రవల్లి కనకరెడ్డి, కోశాధికారిగా నారోజు నాగరాజు, ప్రచార కార్యదర్శిగా పాకాల రాజు, సోషల్ మీడియా అధ్యక్షులు పాకాల భాస్కర్, యువజన కాంగ్రెస్ కమిటీ గ్రామ అధ్యక్షుడిగా చెరుపు రాజు, ఉపాధ్యక్షుడిగా జక్కిరెడ్డి జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండెల్లి యాదగిరి,ప్రచార కార్యదర్శి ఆడెపు నవీన్,కోశాధికారి కత్తి భిక్షపతి, మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా చేర్యాల అశ్విని, ఉపాధ్యక్షురాలిగా గుండెల్లి భారతవ్వ, ప్రధాన కార్యదర్శిగా పాకాల లక్ష్మీ, ప్రచార కార్యదర్శిగా చేర్యాల లచ్చవ్వ, కోశాధికారి పాకాల భవాని, ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా పాకాల బాలయ్య, ఉపాధ్యక్షుడిగా పాకాల బాబు, ప్రధాన కార్యదర్శి చేర్యాల బాల్ సిద్దులు, ప్రచార కార్యదర్శిగా చేర్యాల రమేష్, కోశాధికారి ఎల్లుపల్లి పర్శరాములులను ఎకగ్రీవంగా అనుకున్నట్లు తెలిపారు.


శివాలి తండాలో ఘనంగా భోగ్‌బండార్



శివాలి తండాలో భోగ్ బండార్ నిర్వహిస్తున్న యూత్ సభ్యులు

ధూళిమిట్ట,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలితండాలో సేవాలాల్ లెజెండ్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో బంజారుల ఆరాధ్యదైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా భోగ్ బండార్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు లకావత్ దేవేందర్ మాట్లాడుతూ...సేవాలాల్ మహారాజ్ భారతదేశంలో మూఢనమ్మకాలు, దురాచారాలను రూపుమాపడానికి కృషి చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో శివాలి తండా పెద్దమనుషులు, యూత్ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాజీసర్పంచ్‌కు దుబ్బాక ఎమ్మెల్యే పరామర్శ



మోహన్ రావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి

సిద్దిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు గన్నమనేని మోహన్‌రావు శుక్రవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదివారం సాయంత్రం దొమ్మాట గ్రామంలో మోహన్ రావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దౌల్తాబాద్ మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ రైమోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.